# ఉపాసన, సాధన, ఆరాధనల త్రివేణి

సవ్యమైన ఉపాసన, జీవన సాధన, ఆరాధన (మానవసేవ) వ్యక్తిని దివ్య మానవునిగా, ఋషిగా, దేవదూతగా మలుస్తుంది.

మనిషి ప్రాణము నిలుపుకొనవలెనన్నచో అతడికి ఆహారము, వస్త్రములు, గృహ వసతి అవసరం. గ్రంథ రచనకు కలము, సిరా, కాగితము అవసరం. పంట పండించుటకు విత్తనము, ఎరువు, నీరు అవసరం. ఈ మూడును ముఖ్యమైనవే. వీనిలో దేనిని కూడ ఉపేక్షించలేము. ఆ విధముగానే, ఆధ్యాత్మిక ప్రగతికి ఉపాసన, సాధన, ఆరాధనల సమన్వయము అవసరము.

## ఉపాసనయొక్క నిజ స్వరూపము

ఉపాసనలో పూజ, స్తోత్రము ముఖ్యమైనవి కావు. ఇవే ఉపాసన అనుకొనుట పొరపాటు. దేవునికి నైవేద్యము పెట్టుట, బాహ్యమైన కర్మకాండ కొంత పూజగా పరిగణించబడుచున్నది. భగవంతుని గుణగణములను కీర్తించుట స్తోత్రము. మిఠాయి, కొబ్బరికాయ మొదలైనవి దేవునికి నైవేద్యము పెట్టుదురు. ఆయనకు అవి లేనట్లు, వాటిని సమర్పిస్తే ఆయన ఆనందంలో తలమునకలు అగునట్లు,



వంది మాగధుల స్తోత్రము వల్ల పాలకుడు ఉబ్బితబ్బిబ్బు అయ్యేవిధముగా – దేవుడు తమ పూజా పురస్కారముల వల్ల ప్రసన్నుడై ప్రాపంచికములగు తమ కోర్కెలు తీర్చునని ప్రజలు భావింతురు. అట్టి వ్యక్తులకు భగవానుని యొక్క తత్వము తెలియదు.

నిజంగా విలువైన వస్తువు మరింత ఖరీదుగా ఉంటుందని స్పష్టంగా గ్రహించాలి. కేంద్ర మంత్రి వర్గంలో చేరాలంటే పార్లమెంటు సభ్యునిగా ఎన్నికకావాలి. ఉపాసన అనగా దగ్గర కూర్చొనుట. రైలులోకి ప్రవేశించాలని ఒకరినొకరు త్రోసుకునే ప్రయాణీకుల పద్ధతి కాదు ఇది. ఒకే మనస్సు, ఒకే ఆత్మ కలిగిన ఇద్దరు ప్రాణమిత్రులు కలిసి కూర్చొనడం ఇది. ఈ సాన్నిహిత్యంలో ఒకరు మరొకరికి శరణాగతి కావాలి. భక్తుడు తన జీవితాన్ని మలచుకుని, భగవంతునికి శరణాగతి కావాలి.

ఆధ్యాత్మిక ఉన్నతికి తొలిమెట్టు ఉపాసన. దాని ప్రాముఖ్యాన్ని, దాని తత్వాన్ని వివరిస్తూ గురుదేవులు ఇలా అన్నారు: "దేవుడు నీవు ఆడించినట్లు ఆడడు. నీవు ఆయనకు భక్తుడవు కావాలి. ఆయన సంకల్పం ప్రకారం నీవు పని చేయాలి. ఆ పని చేయగలిగితే, నీవు దేవునితో ఏకం అవుతావు. మంటను కౌగలించుకుని, మంటగా



మారినపుడే కట్టెకు సార్థకత. నీవు కట్టెగా మారాలి. కట్టె నిప్పుగా మారాలి. మురుగు కాలువ నదిలో కలుస్తుంది. నదివలె పవిత్రంగా, గొప్పగా మారుతుంది. కాని, నది వ్యతిరేక దిశగా ప్రవహించి మురుగు కాలువను కలిసి, దానివలె మురికిగా మారడం ఎన్నడూ జరుగదు. ఇనుము పరుసవేదికి తాకితే బంగారంగా మారుతుంది. అది పరుసవేదిగా మారదు. సాధకుడే తోలుబొమ్మవలె భగవంతుడు ఆడించినట్లు ఆడాలి. దేవుడు సాధకుని కోర్కెలను తీర్చడు. సాధకుడే తీర్చాలి. నీటిబొట్టు సముద్రంలో కలిసి సముద్రం అవుతుంది. సముద్రం నీటి బొట్టుగా మారదు. ఉపాసనలోని తత్వం ఇది. ఉపాసన చేయగోరే వ్యక్తి దేవుని దగ్గర కూర్చొని, ఆయన సంకల్పాన్ని అమలుచేసే అనుచరుడుగా మారాలి".

నేను ఆ పద్ధతినే అనుసరించాను. నేను దేవుడిని పూజించాను. దివ్యమాత గాయత్రీ జపం చేశాను. దివ్యపిత సవితపై ధ్యానం చేశాను. నిరంతరం నాలో ఒకే భావం ఉండేది. శ్రవణ కుమారుని వలె నేను నా తల్లిదండ్రుల నుండి దేనినీ కోరను. వారిని మోసుకుని తీర్థయాత్రలకు తీసుకువెళతాను. యోగ్యులైన తల్లిదండ్రులకు యోగ్యుడైన కుమారుడుగా పిలువబడే విధంగా నేను నా వ్యక్తిత్వాన్ని



మలచుకుంటాను. ధ్యాన సౌలభ్యం కోసం నేను గాయత్రిని మాతగా, సవితను పితగా పరిగణించాను. అయినా, వారు నిరాకారులు, అంతరిక్షవాసులని, సర్వవ్యాపకులని నాకు తెలుసు. ఈ విశ్వాసం కారణంగా – వారు నా ఆత్మను పూర్తిగా ఆవరించి ఉన్నారని నేను భావించగలిగాను. వారితో నాకు పూర్తి తాదాత్మ్యం ఏర్పడింది. దేవుని, గాయత్రీమాతను నేను ప్రత్యేక వ్యక్తులుగా పరిగణించి ఉంటే, మా మధ్య దూరం నిలచి ఉండేది. పూర్తి తాదాత్మ్య భావన నాకు లభించేది కాదు.

ప్రారంభంలో సాధన కోసం వ్యక్తి తనను లతగా, దేవుడిని చెట్టుగా పరిగణించాలి. లత చెట్టును చుట్టుకుంటుంది. చిటారు కొమ్మకు చేరుతుంది. తాను తన జీవితాన్ని క్రమశిక్షణబద్ధంగా, స్ఫూర్తి ప్రదంగా చేసికోవడానికై వ్యక్తి తనను మురళిగా, దేవుని మురళీధరునిగా పరిగణించాలి. గాలిపటం గాలిలో ఎగురుతూ ఉండడం, దానిని అదుపుచేసే దారం బాలుని చేతుల్లో ఉండడం అనే విషయాన్ని ధ్యానం చేయడం కూడ ప్రయోజనకరం. నేను ఈ మూడు విధములైన ధ్యానములను చేశాను. ఉత్సాహకరమైన, ఆనందకరమైన అనుభవాలను పొందాను.

నా ఉపాసనలో కర్మకాండకు అంత ప్రాధాన్యం లేదు. ఆ ఉపాసన భావతీవ్రతతో, భక్తి శ్రద్ధలతో పొంగిపొరలింది. జపం చేయడంలో నేను నిర్ణీత పద్ధతిని అక్షరాలా పాటించాను. రోజూ ఉదయం ఒంటిగంటకు నిద్రలేచి జపం చేయడంలో నాగా ఉండేది కాదు – అత్యవసర పరిస్థితి వస్తే తప్ప. ఏదైనా కొరత వస్తే, దానిని మరునాడు పూర్తి చేసేవాడిని. బకాయి ఎన్నడూ మిగిలేదు కాదు. నా త్యాగం, ఏకత్వం, తాదాత్మ్యం, ద్వంద్వములు, తిరస్కృతి అనే భావనలను మేలుకొలిపే అభ్యాసం మొదట్లో ఊహ రూపంలో జరిగేది. తర్వాత అది స్వభావంలో అంతర్భాగం అయింది. చివరికి ఆత్మసాక్షాత్కారంగా పరిణితి చెందింది.

గాయత్రీ మాత యొక్క శక్తి కారణ శరీరంలో శ్రద్ధగా, సూక్ష్మ శరీరంలో ప్రజ్ఞగా, భౌతిక శరీరంలో నిష్ఠగా ప్రతిబింబించింది. ఇది వట్టి కపోల కల్పనగా మిగిలిపోకుండా జాగ్రత్తపడడానికై కఠినమైన ఆత్మ పరీక్ష ఎప్పటికప్పుడు జరిగేది. ఆదర్శవాద జీవితాన్ని గడపాలనే నిష్ఠ, మానవాళికి సేవ చేయాలనే నిష్ఠ, పెరిగాయా లేదా? ప్రలోభం తొలగిందా లేదా? అని రోజువారీ సంఘటనల వెలుగులో నన్ను నేను పరీక్షించుకున్నాను. విశ్లేషించుకున్నాను. ఋషికల్పుడైన సాధకుని



భావనలవలె నా భావనలు పూర్తిగా పరిణతి చెందినట్లు కనుగొన్నాను.

గాయత్రీ మాత స్త్రీ రూపంలో దివ్యశక్తిగా వ్యక్తమవుతుంది. ఆమె ప్రజ్ఞగా మనోభూమికి ఆధిపత్యం వహించింది. ప్రజ్ఞ రూపంలో వివేకం, బాధ్యతాయుతతత్వం, నిర్భీకతల సమన్వయం అంతరాంతరాలలో జరిగిందా అని ధృవపరచుకోవడానికై నేను పలు సందర్భాలలో పరీక్ష జరిపాను. గాయత్రీ మాత ప్రజ్ఞగా నా ఆంతః చైతన్యంలో అవతరించిందనీ, నా ఉపాసన, జపము, ధ్యానము ఫలించాయనీ నేను అనుభూతి పొందుతూవచ్చాను. మన విశ్వాసాలు, మన సిద్ధాంతాలు, మన కర్మలలో, గుణములలో, స్వభావములలో ప్రతిబింబించడం అన్నది ఉపాసనకు నిజమైన పరీక్ష.

త్రిపదా గాయత్రిలోని మూడవ అంశం నిష్ఠ. నిష్ఠ అంటే దృఢ నిశ్చయం, ఓర్పు, ధైర్యం, సాహసం, తపస్సు, ధృతి. కుమ్మరి ఆవం నుండి వెలికి తీసిన కుండను వ్రేళ్లతో మ్రోగించి చూస్తాడు. అది పూర్తిగా కాలిందా, సగం సగం కాలిందా అని పరీక్షిస్తాడు. అలాగే, ప్రలోభాలవల్ల, భయం వల్ల నా దృఢత్వం సడలిందా అని నేను ఆత్మపరీక్ష చేసుకుంటూ వచ్చాను. ప్రతి అడుగూ ముందడుగేనని కనుగొన్నాను.



సవిత యొక్క తేజస్సును బ్రహ్మవర్చస్సు అంటారు. దానిని ఓజస్సు, తేజస్సు, వర్చస్సు అని కూడ అంటారు. పుణ్యము, కుశాగ్రత, దీప్తి అనే రూపాలలో అది ప్రత్యక్షంగా ప్రతిబింబిస్తుంది. భౌతిక, సూక్ష్మ, కారణ శరీరాలలో సవిత యొక్క తేజస్సు వర్షించినపుడు – శరీరం బలంతో, మెదడు జ్ఞానంతో, హృదయం ప్రేమ ధైర్యాలతో నిండిపోతుంది. నా ఆత్మ అంతా ఒక కాంతి క్షేత్రంగా, అగ్ని జ్వాలగా మారిన అనుభూతి ఆ తర్వాత నాకు కలిగింది. నా శరీరంలోని ప్రతి కణంలో నుండి అమృతం ప్రవహించింది. సోమరసాన్ని త్రాగుతూన్నట్లు, సంతృప్తినీ, సాఫల్యాన్నీ, శాంతినీ, ఆనందాన్నీ పొందుతూన్నట్లు నాకు అనుభూతి కలిగింది.

ప్రతి రోజూ నాలుగు గంటలపాటు నేను చేసిన ఉపాసనలోని నియమిత కార్యక్రమం క్లుప్తంగా ఇది. విసుగుదల, అలసట, ఆవులింత లేకుండా ఈ సమయం సునాయాసంగా సాగిపోయేది. అరగంట మాత్రమే గడిచినట్లు అనిపించేది. అనుక్షణం నేను దివ్యానందాన్నీ, దైవ సాన్నిధ్యాన్నీ పొందాను. ఇది నిత్య విధి అయింది. లెక్కించాలని, గొప్ప చెప్పుకోవాలని, బహుమతులను గురించీ, ఫలితాలను గురించీ ఆలోచించాలని నాకు అనిపించేది కాదు. దినచర్యలోని మిగతా



పనులవలెనే, ఉపాసన – దేవుని సన్నిధిలో కూర్చోవడం – నాకు సజీవమైన, సహజమైన చర్య అయింది. ఆ ఉపాసన లేనిదే నేను ఒక్క రోజయినా జీవించలేను. ప్రతీ రోజు నిర్ణీత సమయంలో ఉపాసన చేయడం ఆధ్యాత్మిక శక్తితో నన్ను నేను నింపుకోవడమే, ఆ శక్తి రోజంతా దివ్యానందంతో నన్ను నింపేది. దేవునిలో నన్ను, నాలో దేవుణ్ణి ఆనందంగా అనుభూతి పొందుతూ నేను అనుక్షణం గడుపుతున్నాను.

ఆంతరిక చైతన్యం ఆ దశలో ఉన్నప్పుడు వ్యక్తి ఎగుడు దిగుడులను సమానంగా స్వీకరిస్తాడు. సంతోషం కాని, విచారం కాని అతడికి ఉండవు. చుట్టూ బ్రహ్మానంద సముద్రం తరంగాలతో కానవస్తుంది.

ఎటు చూసినా నాకు దైవమే కనిపిస్తున్నాడు. నేను ఎక్కడకు వెళ్లినా అతడు నా ప్రక్కన నడుస్తున్నాడు. ప్రతి క్షణం ఆయన ఉనికి నాకొక రక్షగా, ఒక మార్గదర్శక శక్తిగా ఉన్నట్లు నేను అనుభూతి పొందుతున్నాను. సముద్రం నీటి బొట్టుగా మారజాలదు. నీటి బొట్టు తన అస్తిత్వాన్ని సముద్రంలో లీనం చేసి తాను సముద్రంగా

మారుతుంది. దేవుని నిరంతర సాన్నిహిత్యంవల్ల నిస్సంకోచం, నిర్భయం సహజంగా ఉదయిస్తాయి.

నేను నా జీవితమంతటిలో దైవం పట్ల శ్రద్ధను నింపుకున్నాను. దైవంతో ఏకం కావడంలో అది నా ఆత్మకు సాయపడింది. భగవతిగా అది తనను తాను వెల్లడించుకుంటోంది. ప్రకటించుకుంటోంది.

## పరాజయం ఎరుగని సాధన

బాలునికివలె మానవునికి కొన్ని పరిమితులు ఉన్నాయి. అతడు తన సృష్టికర్త అయిన శక్తిమంతుడైన భగవానుని నుండి అక్షయమైన శక్తిని పొందుతాడు. అయితే ఇందుకు నిబంధనలు ఉన్నాయి. బాలురకు వస్తువుల విలువ తెలియదు. కనుక వారికి చౌక అయిన ఆటవస్తువులు, చిన్న చిన్న గాలి బుడగలు, ఈలలు, నిమ్మరసం, టాఫీల వంటివి ఇస్తారు. బాలుడు పెద్దవాడు అయినపుడు, తన బాధ్యతలను తెలుసుకున్నప్పుడు, అతడికి అడగకుండానే అన్నీ వారసత్వంగా అందుతాయి. ఇందుకోసం యాచించడం కాని, ప్రాధేయపడడంకాని, ప్రార్థించడంకాని అవసరం ఉండదు. భగవంతుడు ఇచ్చిన బహుమతులను ఉదాత్త ప్రయోజనాల కోసం, మానవసేవ కోసం వినియోగించే సామర్థ్యం మనకు ఉన్నదనీ, వాటిని



సంకుచిత స్వార్థ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయమనీ మనం నిరూపించినపుడు – మనము అడిగినదాన్నికన్న వేయిరెట్లు ఇవ్వడానికి భగవంతుడూ, దేవ మానవులూ ముందుకువస్తారు.

భవిష్యత్తు గురించి లేనిపోని హామీలు ఇవ్వడం వల్ల ప్రయోజనం ఉండదు. ఇంతవరకు ఇవ్వబడినది సద్వినియోగం అయిందని ఋజువు చూపాలి. ప్రమోషన్ ఇచ్చేముందు గత చరిత్రను పరిశీలించడం ఇందుకే. నా సామర్థ్యాన్ని గురించి, చిత్తశుద్ధి గురించి నేను అనేక పూర్వజన్మలలో ఋజువులు చూపవలసివచ్చింది. అన్నీ సవ్యంగా ఉన్నాయని తెలుసుకున్న తర్వాత నా మీద బహుమతులు, అనుగ్రహం కురిసేయి.

సుగ్రీవుడు, విభీషణుడు, కుచేలుడు, అర్జునుడు పొందినదీ, వారు చేసినదీ అంతా వారి స్వప్రయత్నాల ఫలితం కాదు. వాటి వెనుక భగవానుని మహాశక్తి పనిచేసింది. కాలువలకు నది నుండి నీరు అందుతుంది. పొలాలకు నీరు అందించే పిల్ల కాలువలకు కాలువల నుండి నీరు అందుతుంది. ఇందులోఎక్కడైనా అవ్యవస్థ ఏర్పడితే, పొరపాటు జరిగితే – మొత్తం నీటి సరఫరా వ్యవస్థ అంతా దెబ్బతింటుంది. మనిషి భగవంతునితో సన్నిహిత బాంధవ్యం



ఏర్పరచుకోవడానికి ఒక నిర్దిష్టమైన ఆధారం ఉండాలి. ఇందులో పొగడ్తలకు తావులేదు. భగవంతుడు ఎవ్వరిపట్లా పక్షపాతం చూపడు. తన బ్రహ్మాండం సక్రమంగా పనిచేయడానికి వెనుక ఉన్న మూల సూత్రాలకు ఆయన కట్టుబడి ఉంటాడు.

నా వ్యక్తిగత సామర్థ్యం చెప్పుకోదగినది కాదు. నేను సాధించినదంతా దైవానుగ్రహ ఫలితమే. ఆ అనుగ్రహం చాలావరకు గురుదేవుల ద్వారా అందినదే.

ఉదాత్తమైన ఈ సాఫల్యం ఎలా సాధ్యపడింది? పాత్రతను లేక యోగ్యతను పెంచుకోవడం వల్ల. దానిని జీవన సాధన అని కూడ అంటారు. దానికి ఉపాసనతో సన్నిహిత సంబంధం ఉంది. విద్యుచ్ఛక్తి కర్ర ద్వారా ప్రసరించదు. తీగె ద్వారా ప్రసరిస్తుంది. తడిసిన కట్టెకన్న ఎండిన కట్టె మరింత త్వరగా, మరింత బాగా మండుతుంది. శిశువు పరిశుభ్రంగా ఉన్నప్పుడు తల్లి దానిని ఒడిలోకి తీసుకుంటుంది. అది మురికిగా ఉంటే, తల్లి ముందు దానిని స్నానం చేయించి ఆ తర్వాత తన ఒడిలోనికి తీసుకుని ఆహారం ఇస్తుంది.

భగవంతునికి దగ్గర కావాలంటే శీలం స్వచ్ఛంగా ఉండాలి. పలువురు వ్యక్తులు తమ పూర్వ జన్మలలో విషయవాంఛలతో కలుషితం



అయినారు. అయితే, శ్రద్ధ, భక్తి, సాధనలను అనుసరించడం వల్ల వారి జీవితాలు గుర్తుపట్టలేనంతగా మారిపోయాయి. వాల్మీకి, అంగుళిమాలుడు, బిల్వమంగళుడు, అజామీళుల పూర్వజన్మలు పుణ్యప్రదంగా లేకపోయినా – భగవానుని శరణాగతి పొందిన మరుక్షణంలో వారు నిజమైన సాధువులుగా మారిపోయారు. 'రామనామ జపనా పరాయా మాల్ అపనా' (యాంత్రికంగా రామనామాన్ని జపించడం, ఇతరులకు చెందినవాటిని వాంఛించడం) అనే విధానాన్ని మనం అనుసరిస్తాం. మనం పాపాలు చేస్తూపోతాం. అయినా కేవలం బాహ్యమైన కర్మకాండద్వారా భగవంతుణ్ణి పూజించడంవల్ల మన పాపాలన్నీ ప్రక్షాళన అయిపోతాయని భావిస్తాం. ఇది వట్టి భ్రమ కాదా?

రంగులు వేసే ముందు బట్టను ఉతకాలి. విత్తే ముందు పొలాన్ని దున్నాలి. భగవానుని అనుగ్రహం పొందాలంటే, ధార్మిక జీవనం గడిపి, సాధకునిగా మారాలి. సాధకుడు మాత్రమే నిజమైన భక్తుడు కాగలుగుతాడు. జీవన సాధన లేనప్పుడు, వ్యక్తి ఆలోచనలు, శీలము, ఆహారము, దినచర్య – అన్నీ అస్తవ్యస్తంగా ఉంటాయి. అత్యాశ, వాంఛలు కారణంగా అలాంటి వ్యక్తికి ఎప్పుడూ మానసిక

శాంతి ఉండదు. అతడు తన మనస్సును ఎన్నడూ కేంద్రీకరించలేడు. కేవలం కర్మకాండ జరపడం వల్ల ఎలాంటి ప్రయోజనమూ కలుగదు. పూజకూ, ఆంతరిక భావనలకూ ప్రత్యక్ష సంబంధం ఉంది. భావనలను ఉదాత్తంగా మలచుకున్నప్పుడే వ్యక్తి తన దృక్పథంలో, కర్మలో, స్వభావంలో ధార్మికతను జీర్ణించుకోగలుగుతాడు.

ఎవరైనా పెద్ద మనిషి అతిథిగా వస్తారని తెలిస్తే, ఏదైనా ఉత్సవం జరిగితే – ఇంటిని అంతటినీ శుభ్రపరుస్తాం. ఇంటికి వెల్లవేయిస్తాం. భగవంతుని మన హృదయ మందిరంలోకి ఆహ్వానించాలంటే – మొదట దానిలో ఉన్న చెత్త చెదారాలను తొలగించి దానిని శుభ్రపరచాలి. ఇందుకై వ్యక్తి ఆత్మ పరీక్ష, ఆత్మ ప్రక్షాళన, ఆత్మ పరివర్తన, ఆత్మ వికాసం జరపవలసి ఉంటుంది. ఈ వాస్తవాలు నాకు వివరించబడ్డాయి. నేను వాటిని పూర్తిగా జీర్ణించుకున్నాను. అసలు మనం నికృష్ట జీవితాన్ని ఎందుకు గడుపుతాం? లోభగుణం, భ్రమ, గర్వం – ఈ మూడూ దానికి మూల కారణాలు. ఈ దుర్గణాలు కలిగిన వ్యక్తి నరకానికి వెళ్ళడం ఖాయం.

మన సంస్కారాలు మన పనులను తీర్చిదిద్దుతాయి. మన



శరీరాన్ని మన మనస్సు అదుపుచేస్తుంది. శరీరం కాక, మనస్సే చెడు పనులన్నింటికీ మూల కారణం. ఈ వాస్తవాన్ని గుర్తించి, ఈ విషవృక్షం వ్రేళ్లను ఛేదించడం మంచిదని నేను భావించాను. మనస్సు ఆధారంగా జీవన సాధన ప్రారంభించాను.

ఆర్థికమైన ఒత్తిళ్ళవల్ల, ప్రలోభాలవల్ల నేరాలు తఱచు జరుగుతాయి. కనుక – సగటు భారతీయునివలె సాదా జీవితం గడపాలని నేను ప్రతిజ్ఞ చేశాను. ఆదాయం ఎంత ఉన్నా, దానిని పొదుపుగా, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా, 'సాదా జీవితం, ఉదాత్త భావన' అనే సూత్రం ప్రకారం ఖర్చుచేయాలి. ఈ సూత్రాన్ని పలువురు మాటలలో సమర్థిస్తారు. కాని, ఆచరణకు వచ్చేసరికి అది కష్టమని గుర్తిస్తారు. ఆ ఆచరణకు చెక్కుచెదరని దృఢత్వం, సంకల్ప బలం కావాలి. ఎందుకంటే – దానిని మాటలలోనే కాక చేతలలో కూడ అక్షరాలా అమలుపరచడానికై కుటుంబ సభ్యులను కూడా తయారు చేయవలసి ఉంటుంది.

ఈ విషయంలో – సమాజంలో వ్యాపించి ఉన్న దృక్పథం చాలా పెద్ద ఆటంకంగా నిలుస్తుంది. న్యాయంగా కాని, అన్యాయంగా కాని సంపాదించిన ధనంతో ప్రతి ఒక్కరూ భోగవిలాసాలలో మునిగి



తేలుతున్నప్పుడు, మనం మాత్రం ఎందుకు సాదాగా జీవించాలి అని ప్రజలు భావిస్తారు. ఈ విషయమై కుటుంబ సభ్యులకు నచ్చజెప్పడం చాలా కష్టం. అయినా మనం చెప్పేదాన్ని చేసి చూపితే, తర్కంతో, వాస్తవాలతో, ఫలితాలతో నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తే, మన నిశ్చయం దృఢంగా ఉంటే, మన సన్నిహితులు ప్రభావితులు కాకపోవడం దాదాపు అసంభవం. ఆర్థిక నేరాలను నివారించాలంటే, ప్రజల మనస్సులను ఈ దిశలో మలచవలసి ఉంటుంది. ఈ విశ్వాసంతో నేను నా ఆదర్శాలకు దృఢంగా కట్టుబడ్డాను. మథురలోని ఘియా మండీలో ఉన్న మా కుటుంబంలో అయిదుగురు సభ్యులు ఉండేవారు. 1971లో హరిద్వార్ వచ్చేవరకు నెలకు రెండు వందల రూపాయలతో మేము కుటుంబాన్ని నడిపాము. నా ఆదాయం సగటు ఆదాయం కన్న ఎక్కువే. నాకు వారసత్వపు ఆస్తి ఉంది. అయినా, పొదుపు ద్వారా, ఇతరుల ప్రమాణాలకు భిన్నమైన ప్రమాణాలను పాటించడం ద్వారా ఇది సాధ్యపడింది. ఉమ్మడి కుటుంబంలోని ఇతర సభ్యుల పిల్లల చదువుకు కూడ ఈ మొత్తం ఖర్చయింది. చెడు అలవాట్లను పెంచే నిల్వ సొమ్ము ఉండనిచ్చేవాణ్ణి కాను. ఆవిధంగా, జీవన సాధనలోని ఒక ప్రధానాంశం ఆచరణలోకి రావడం సాధ్యపడింది.



కుటుంబాన్ని భోగ విలాసాలలో ముంచాలనే కోరిక మనిషిలో ఉంటుంది. చనిపోయేటప్పుడు వారసత్వంగా పెద్ద ఆస్తి ఇచ్చివెళ్ళాలనే కోరిక ఉంటుంది. భోగ విలాసాలకు దాసులైన వ్యక్తుల పిల్లలు అన్ని రకాల సుఖభోగాలకు బానిసలు అయిపోతారు. ఆవిధంగా ఆడంబరాలూ దుబారా ఖర్చు ప్రారంభం అవుతాయి. అన్యాయంగా సంపాదించిన ఆస్తి విచ్చలవిడి జీవితాన్ని గడపడానికి ఖర్చుకావడం ఖాయం. ఇతరుల పతనం నుండి నేను ఈ గుణపాఠం నేర్చుకున్నాను. అలాంటి దృక్పథం నా ఇంటిలో ప్రవేశించకుండా జాగ్రత్త పడ్డాను. ఆవిధంగా సంస్కారాలతో, సదాచారాలతో నిండిన కుటుంబం ఏర్పడింది.

గొప్పలు, ఆడంబరాలు, వింత అలంకరణలు, ఫ్యాషన్ల కోసం జనం ఎంతో డబ్బు, సమయం ఖర్చు చేస్తారు. అహంకారాన్ని పెంచి గొప్పలు చెప్పేందుకు పనికివచ్చే అలాంటి అల్ప విషయాలకు నా జీవితంలో స్థానం లేదు. ఎందుకంటే – నా వ్యక్తిగత జీవితంలోనూ, కుటుంబ జీవితంలోనూ బ్రాహ్మణమైన మర్యాదతో, నిరాడంబరత్వంతో నిండిన వాతావరణాన్ని నేను నిరంతరంగా కొనసాగించాను. ఇంటి పనులన్నింటినీ స్వయంగా చేసికొనే అలవాటును మేము చేసుకున్నాం.

సంవత్సరాల తరబడిగా మాతాజీ ఇంటిలో గోధుమలు విసిరి పిండి చేసేవారు. కుటుంబానికీ, అతిథులకూ స్వయంగా వంట చేసేవారు. మిషన్ పని ఎన్నోరెట్లు పెరగడంతో ఇంటి పనులు చేయడానికి ఆమెకు తీరిక చిక్కనందువల్లనే పనిమనిషిని పెట్టుకోవలసివచ్చింది.

ఆడంబరంగా జీవించేవారిని గొప్పవారుగా, సాదాగా జీవించేవారిని దురదృష్టవంతులుగా వెనుకబడినవారుగా పరిగణించడం అనేది విలువలు తారుమారు కావడం వల్ల ఏర్పడిన దురభిప్రాయం. అది నా జీవితంలో ఎన్నడూ అమలు కాలేదు. సోమరితనం వల్ల కాని, చేతకానితనం వల్ల కాని దారిద్ర్యం వచ్చి ఉంటే – ఆ విషయం వేరు. మరో ప్రక్క ఉన్నతమూ, ఉదాత్తమూ అయిన నీతి సూత్రాలకు అనుగుణమైన జీవన విధానాన్ని మేము స్వచ్ఛందంగా, ఆనందంగా అవలంబించాం. నా సంపర్కంలోకి వచ్చిన నా బంధుమిత్రులు దానిని దారిద్ర్యంగా కాక, బ్రాహ్మణ సంప్రదాయాలను నెలకొల్పడానికొక ఉదాహరణగా పరిగణించారు. ఆడంబరాలు వదలివేసి, పావుకోళ్ళు ధరించి తమ నిరాడంబరత్వాన్నీ, నీతిని చాటి చెప్పుకునే వారు ఉన్నారు. నిజమైన బ్రాహ్మణుని జీవన విధానంగా తమ జీవన విధానాన్ని అంతటినీ మలచుకునేందుకు



అనుక్షణం ప్రయత్నపూర్వకంగా కృషి చేయడానికి అనుగుణమైన సర్వసమగ్రమైన ఆత్మ సంయమనాన్ని, అనుశాసనాన్ని పాటించే వ్యక్తులు నిజమైన ఆధ్యాత్మిక జీవితాన్ని గడుపుతారు. ఇందుకు క్రమమూ, సుదీర్ఘమూ అయిన సాధన అత్యవసరం. ఆ విధంగా నేను నన్నూ, నాతో ముడిపడిన వారందరినీ తీర్చిదిద్దాను.

జీవితం దుష్ట సంస్కారాల వల్ల, దురలవాట్లవల్ల ప్రభావితం అవుతుంది. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు నన్ను పథం నుండి మరల్చడానికి ప్రయత్నించాయి. అయితే, అవి నా అంతరంగంలో స్థానం ఏర్పరచుకొనకముందే నేను వాటిని తరిమివేశాను. మనిషి ఏమరుపాటుగా ఉన్నప్పుడు, తన రక్షణ ఏర్పాట్లను సడలించినపుడు మాత్రమే అవి జయిస్తాయి. నా గుణ కర్మ స్వభావాలలో సాధకుని ధర్మం రంగరించబడేటట్లు శ్రద్ధ తీసుకోవడానికై నేను వాటిపై గట్టి నిఘా ఉంచాను. నేను అందులో విజయం సాధించానని సవినయంగా మనవి చేయగలగడం నాకు తృప్తి కలిగించే అంశం.

పుట్టినప్పుడు ప్రతి వ్యక్తీ ముడి సరుకుగా, నగిషీ లేని సరుకుగా ఉంటాడు. ప్రతి జీవాత్మ పూర్వజన్మల నుండి తనతో పాటు చెడు



వాసనలను, సంస్కారాలను తీసుకువస్తుంది. మనిషిని బట్టి వీటిలో హెచ్చుతగ్గులు ఉంటాయి. వీటిని ఒక్కసారిగా నిర్మూలించడం సాధ్యపడదు. గురువు యొక్క అనుగ్రహం, పూజలు, స్తోత్రాలు ఇందుకు పనికిరావు. ఆ చెడు వాసనలను దృఢంగా ఎదిరించడం ఒక్కటే మార్గం. ఒక చెడు తలంపు చొరబడగానే దానిని పారద్రోలడానికై ఉదాత్త భావనల పోటీ సైన్యానికి తగు తరిఫీదు ఇచ్చి సిద్ధం చేసికోవాలి. చెడు తలంపులకూ, చెడు సంస్కారాలకీ మన మనస్సులలో స్థిరపడే అవకాశం ఇవ్వకపోతే – అవి ఎక్కువ సేపు నిలవలేవు. వాటి బలం పరిమితమైనదే. అవి ప్రధానంగా అలవాట్లపైనా, పొరపాట్లపైనా ఆధారపడి ఉంటాయి. మరోప్రక్క సదాలోచనలకు తర్కం, వాస్తవాలు, ఋజువులు, వివేకం మున్నగు వాని ఆసరా ఎపుడూ ఉంటుంది. చివరకు సత్యమే జయిస్తుందని శాస్త్రకారులు చెప్పిన మాట అక్షరాలా నిజం. ఉన్నతమైన మన నిజ స్వభావంలో ఉండేవి దివ్య గుణాలూ, ఉదాత్త ధోరణులూ మాత్రమే. దుష్ట ధోరణులు వట్టి నీడలు మాత్రమే. కోతులకూ, ఎలుగుబంట్లకూ తర్ఫీదు ఇచ్చి, వాటి చేత ఎన్నెన్నో ఆశ్చర్యకరమైన పనులు చేయించగలుగుతూన్నప్పుడు – ముడి సరకుగా ఉన్న మనస్సును



తీవ్ర సాధన ద్వారా సంస్కరించడం, పునీతం చేయడం ఎందుకు సాధ్యపడదు?

### *నిరాటంకంగా సాగిన ఆరాధన*

గంగ, యమున, సరస్వతుల సంగమాన్ని త్రివేణి అని పిలుస్తారు. అందులో స్నానం చేసిన వ్యక్తి పునరుజ్జీవితుడు అవుతాడని చెబుతారు. కొంగ హంసగా మారకపోవచ్చు. కాకి కోకిలగా మారకపోవచ్చు. అయినా – ఉపాసన, సాధన, ఆరాధనల త్రివేణి మనిషియొక్క ఆంతరిక జీవనాన్ని, బాహ్య జీవనాన్ని సమగ్రంగా పరివర్తన చేయడం తథ్యం. ఒక ప్రత్యేక పద్ధతిలో, ఒక ప్రత్యేక సమయంలో జరుపవలసిన కర్మకాండలు మనిషి యొక్క ఆలోచనలో, ప్రకృతిలో, నడవడిలో ఉన్నత స్థాయి పరివర్తనలు తీసుకువచ్చే పరికరాలు. ఇందుకోసం వ్యక్తి తన శారీరక, మానసిక కార్యకలాపాలపై నిరంతరమైన నిఘా ఉంచడం అవసరం. దుర్గుణాలను నిర్మూలించాలంటే నిత్య జాగరూకత అవసరం. సర్కస్‌లో క్రూర మృగాలకు, పక్షులకు తరిఫీదు ఇచ్చి వాటి చేత అద్భుతాలు చేయిస్తారు. అలాగే – మన గుణకర్మ స్వభావాలను అదుపు చేయడానికి వాటిలో ఉన్నతమైన ఆదర్శవాదాన్ని నింపవలసి ఉంటుంది. ఉపాసనను

కొద్దిసేపు చేయవచ్చు. కాని, శిశువును నిరంతరం కాపలా కాసే విధంగా, సాధన నిరంతరంగా సాగాలి. సాధనతో జోడింపబడిన ఉపాసన మాత్రమే సఫలం అవుతుంది. ఉపాసనను కేవలం ఒక యాంత్రికమైన క్రియగా పరిగణించి, ఫలానా కర్మకాండ జరిపితే ఫలానా సిద్ధి వస్తుందని కలలు కనేవారు పూర్తిగా భ్రమలో మునిగినవారే.

త్రిపదా గాయత్రిని ఎలా ఉపాసన, సాధన, ఆరాధన చేయాలో గురుదేవులు మొట్టమొదటి రోజునే నాకు స్పష్టంగా సూచించారు. క్రమబద్ధమైన జపధ్యానాలతో పాటు – సాధకుని ఆలోచనలో, భావనలో ఉపాసన, అతని ప్రకృతిలో సాధన, సామాజిక వ్యవహరణలో ఆరాధన అంతర్లీనంగా ఉండాలనీ, దీనితో పాటు శ్రద్ధ, మెలకువలు ఉండాలనీ ఆయన పేర్కొన్నారు. నేను ఇంతవరకు ఈ సూచనలను అక్షరాలా పాటించాను. దాని ద్వారా సాధించిన ఫలితాలు ప్రత్యక్షంగా కానవస్తున్నాయి.

ఆరాధన అంటే సమాజ సేవలో లీనం కావడం. జీవన సాధన అంటే సంయమన సాధన. తన కోసం కనీసంగా ఖర్చు చేసి, గరిష్టంగా పొదుపు చేయడం. తానూ, తన కుటుంబమూ సగటు పౌరుని జీవన



స్థాయిలో సాదాగా, హుందాగా జీవించడానికి అవసరమైనంత మేరకే వ్యక్తి తన సమయాన్నీ, శ్రమనూ, ధనాన్నీ, శక్తి సామర్థ్యాలను వినియోగించడం. ఈ కొలబద్దపై కొలిస్తే – కష్టించి పని చేసే విద్యావంతుడు తన ప్రధాన అవసరాలు తీరగా కొంత మిగల్చగలుగుతాడు. పొదుపు చేసిన ఈ మొత్తాన్ని ఉత్తమోత్తమంగా వినియోగించడమే ఆరాధన. ఈ ప్రపంచంలో స్వంత అవసరాలు ఉన్నవారు మరెందరో ఉన్నారనే గుర్తింపు సాధారణంగా జనానికి కలుగదు. కనుక, వారు ఈ పొదుపు మొత్తాన్ని తమకోసం, తమ కుటుంబంకోసం దుర్వినియోగపరుస్తారు. వారిలో మానవసేవా దృక్పథం ఉంటే వారు తమ పొదుపు మొత్తాన్ని ప్రజోపయోగకరమైన పనుల కోసం వినియోగించి యుగ అవసరాన్ని తీర్చి ఉండేవారు.

వ్యక్తి యొక్క అభిరుచికీ, నమ్మకానికీ అనుగుణంగా ధ్యానం చేయడంకోసమై దైవాన్ని సాకారంగా పరిగణిస్తాం. ఆ ఆకారం మానవుణ్ణి పోలి ఉంటుంది. ఈ భావన అవసరమే, ప్రయోజనకారే. అయితే, ఇది కల్పితమనీ, వాస్తవం కాదనీ గుర్తించాలి. దైవం ఒక్కడే. వివిధ మతాలు, పంథాలూ భావించినట్లు అతనికి అనేక రూపాలు ఉండే అవకాశం లేదు. ఆకారం యొక్క ప్రయోజనాన్ని మానసిక



ఏకాగ్రతను అభ్యాసం చేయడానికి పరిమితం చేయాలి. కనబడే విగ్రహం ద్వారా కనబడని దైవాన్ని అర్థం చేసుకోవడానికీ, దర్శించడానికీ, జీర్ణం చేసికోవడానికీ కృషి చేయాలన్నది విగ్రహారాధన వెనుక ఉన్న మూల సూత్రం.

సర్వ శక్తిమంతుడైన దైవం నిరాకారుడే అవుతాడు. దైవాన్ని పరమాత్మ అంటారు. ఆయనలో జీవాత్మలన్నీ ఉన్నాయనీ, ఆయన వాటికి అతీతుడనీ దాని అర్థం. అదే విరాట్ బ్రహ్మ లేక విరాట్ విశ్వం. శ్రీకృష్ణుడు ఈ విరాట్ రూపాన్ని, ఈ విశ్వరూపాన్ని అర్జునునికీ, యశోదకూ చూపేడు. కౌసల్య, కక్‌భూసుంది కూడ ఈ విశ్వరూపాన్ని దర్శించారు. ఈ సిద్ధాంతం ప్రకారం ప్రజాసేవ విశ్వబ్రహ్మ యొక్క ఆరాధన అవుతుంది. భగవంతుడు మనిషిని తన రాకుమారునిగా పంపాడు. ఈ విశ్వాన్ని నందనవనంగా, సుఖ సమృద్ధులకు నిలయంగా మార్చడానికై అతనికి అమూల్యమైన మానవ జన్మ ఇచ్చాడు. ఈ లక్ష్యాన్ని సాధించడంలోనే మానవ జన్మ సార్థక్యం ఉంది. అదే ఆరాధన.

నేను ఈ ఆరాధన జరుపుతూ వచ్చాను. రాత్రి 12 గంటలలో 4 గంటలు క్రమబద్ధంగా ఉపాసనకు కేటాయించారు. మిగతా



సమయంలో నిద్ర, ఇతర దినచర్య. వ్యక్తి సోమరిగా ఉంటే, నిర్లక్ష్యంగా ఉంటే, అతని సమయమంతా తీరూతెన్నూ లేకుండా పద్ధతి లేకుండా గడచిపోతుంది. కాని, నడుం బిగిస్తే, మెలకువ వహిస్తే – అతడు అద్భుతాలను సాధించగలడు. పగలు 12 గంటలలో రెండు గంటలు భోజనానికీ, విశ్రాంతికీ, ఇతర పనులకూ వదిలితే – 10 గంటలు నికరంగా మిగులుతాయి. ఈ పదిగంటలూ నేను నియమబద్ధంగా ప్రజాసేవకు వినియోగిస్తూ వచ్చాను. ఈ ఆరాధన కార్యకలాపాలను ఇలా వర్గీకరించవచ్చు.

(1) యుగచైతన్యం యొక్క ఆదర్శాలకు అనుగుణంగా ప్రజల మనస్సులనూ, దృక్పథాలనూ సంస్కరించడానికై పత్రికలు, పుస్తకాలు, మున్నగువాటిని రచించడం, ప్రచురించడం.

(2) యుగ ధర్మానికి అనుగుణమైన జీవన విధానాన్ని అనుసరించడానికై సాధకులకు స్ఫూర్తినీ, మార్గదర్శనాన్నీ ఇవ్వడం.

(3) తమ వ్యక్తిగతమైన ఇబ్బందులను తొలగించుకుని, ఉన్నత సిద్ధాంతాల ఆధారంగా ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవడానికై నా వద్దకు మార్గదర్శనం కోసం, సలహా కోసం వచ్చే వ్యక్తుల ఆత్మలను ఎదిగేటట్లు చేయడానికి వారికి సూచనలు ఇవ్వడం.

అసంఖ్యాకులైన వ్యక్తులు నా సంపర్కంలోకి వచ్చారు. వారిలో అధిక సంఖ్యాకులు మారారు. మార్గదర్శనం పొందారు. ప్రయోజనం పొందారు. ఆయా సంఘటనలను వర్ణించడం, ఆయా వ్యక్తుల పేర్లను పేర్కొనడం సాధ్యం కాదు. ఎందుకంటే అది నా అలవాటు కాదు. పైగా నాకు ఇప్పటికీ జ్ఞాపకం ఉన్న సంఘటనలను లిపిబద్ధం చేసినా, అదొక మహాగ్రంథం అవుతుంది. కాని, సంబంధిత వ్యక్తులు అందుకు అభ్యంతరం తెలుపవచ్చు. కృతజ్ఞత తెలిపే అలవాటు ఇప్పుడు దాదాపు నశించింది. కనుక, ఆ సంఘటనలను గురించి ఏదైనా చెప్పడం అనుచితం అవుతుంది. అంతే కాదు. మంచి పనుల సత్ఫలితాలను వెల్లడి చేయడం వల్ల ఆ పుణ్యం తరిగిపోతుంది.

అయితే, ఈ సేవలు ఎంతో ప్రభావాన్ని కలిగించాయనడంలో సందేహం లేదు. ఇంతవరకు (1989) 24 లక్షల మందికి పైగా వ్యక్తులు ప్రజ్ఞా పరివార్‌తో సంబంధం కలిగి ఉన్నారు. అయినా, మిషన్ యొక్క సిద్ధాంతాలవల్ల, ఆదర్శాలవల్ల గాఢంగా ప్రభావితులైన వారి సంఖ్య ఇందులో సుమారు మూడవ వంతు ఉంటుంది. వారిలో అధిక సంఖ్యాకులు తమ వ్యక్తిగత జీవితంలో నా నుండి మార్గదర్శనం, అభిమానం, సహాయం, సలహా, దివ్య బహుమతులు పొందినవారు.



విషమ సమస్యలతో సతమతమై నా వద్దకు వచ్చి, పరమానందంతో, శాంతితో తిరిగి వెళ్ళినవారు. ఇంతటి విశాలమైన కుటుంబం నిర్మాణం కావడానికి కారణం ఇదే. ఇదంతా కేవలం సిద్ధాంతాలపై ఆధారపడి ఉంటే – గాయత్రీ పరివార్ సభ్యత్వం ఆర్యసమాజం, సర్వోదయ్ సమాజం సభ్యత్వం వలె పరిమితంగా ఉండేది. వ్యక్తిగతమైన సాన్నిహిత్యం, బంధుత్వ బంధనాలతో కూడిన వాతావరణం నిర్మాణం అయ్యేది కాదు. వ్యక్తులు భారీ సంఖ్యలో రావడం, అర్ధరాత్రీ అపరాత్రీ రావడం, వారి వసతికీ, భోజనానికీ ఏర్పాట్లు చేయడం – ఇందువల్ల మాతాజీకి పని ఒత్తిడి విపరీతంగా ఉండేది. ఈ అసౌకర్యాలన్నీ ఉన్నప్పటికీ – ఇందువల్ల మాకు ప్రేమాభిమానాలు పుష్కలంగా అందాయి. ఈ ప్రేమాభిమానాల రూపంలో మేము ప్రజలకు చేసినదంతా వడ్డీతో సహా తిరిగివచ్చింది. కనుక ఇందులో మేము నష్టపోయామని చెప్పలేము.

ఆరాధనకు – అంటే ప్రజాసేవకు – ధనం అవసరం అవుతుంది. ఆకలిగొన్న వ్యక్తి ఇతరులకు ఎలా భోజనం పెట్టగలడు? మరి ఈ ధనం ఎక్కడ నుంచి వస్తుంది? “నీకు ఉన్నదానిని విరాట్ బ్రహ్మ అనే పొలంలో విత్తనంగా చల్లడం నేర్చుకో” అని గురుదేవులు



మా మొదటి సమాగమంలోనే చెప్పారు. ఒక్క విత్తనం చల్లితే వంద గింజలు పంటగా వస్తాయి. గురుదేవులు జలారామ్ బాపా ఉదాహరణ ఇచ్చారు. జలరామ్ బాపా ఒక రైతు. అతడు తన పొదుపు మొత్తాన్ని అంతటినీ అన్నార్తులకు అన్నం పెట్టడానికి ఖర్చు చేసేవారు. భగవంతుడు ఆయన కృషిని మెచ్చుకున్నాడు. ఆయనకొక అక్షయపాత్ర ఇచ్చాడు. జలరామ్ బాపా ప్రారంభించిన ఉచిత భోజనశాల గుజరాత్‌లోని విర్పూర్ గ్రామంలో ఇప్పటికీ నడుస్తోంది. అక్కడ రోజూ వేలాదిమంది భక్తులు భోజనం చేస్తున్నారు. తన ధనాన్ని ప్రజాశ్రేయస్సు కోసం వినియోగించే వ్యక్తికి సహకారం అందుతుంది. సత్వరంగా, ఆనందంగా అందుతుంది. డబ్బు కూడబెట్టి, దానిని వినియోగించకుండా ఉంచి, ఇంకా ఇంకా డబ్బు నిల్వచేసికొనే వ్యక్తిని ప్రజలు నిందిస్తారు. హేళన చేస్తారు.

గురుదేవుల ఆదేశాల ప్రకారం నా సర్వస్వాన్ని భగవంతుని పాదాల వద్ద సమర్పణ చేశాను: (1) శారీరిక శ్రమ చేసే సామర్థ్యం (2) మానసిక శ్రమ చేసే సామర్థ్యం (3) భావనలు (4) వారసత్వపు ఆస్తి. ఇందులో స్వంతంగా సంపాదించింది ఏదీ లేదు. ఈ నాలుగు రకాల సంపదనూ నేను నిర్దిష్టమైన ప్రయోజనాల కోసం భక్తి శ్రద్ధలతో



వినియోగించాను. అందువల్ల అది నాకు వందరెట్లుగా తిరిగివచ్చింది. నేను రోజుకు 12 గంటలపాటు శారీరిక శ్రమ చేశాను. ఎన్నడూ అలసిపోలేదు. అంతే కాదు. నా కార్యకుశలత పెరుగుతూ వచ్చింది. ఈ ముసలితనంలో సైతం యువకుని వలె పనిచేసే సామర్థ్యం నాకున్నది. మానసిక, శారీరక శ్రమలను సమానాంతరంగా చేశాను. ముసలితనం నా పనినీ, నైతిక బలాన్ని ఎన్నడూ ప్రభావితం చేయలేదు.

నేను వ్యక్తులను మనసారా ప్రేమించాను. వ్యక్తులు నన్ను ఎంతగానో ప్రేమించారు. వారు నాకు వ్యక్తిగతమైన అభిమానాన్ని, గౌరవాన్ని, సుహృద్భావాన్ని అందించారు. అంతే కాదు. ఈ మిషన్ కోసం పని చేయవలసిందిగా నేను విజ్ఞప్తి చేసినప్పుడు వ్యక్తులు నిండు హృదయంతో స్పందించారు. రెండు సంవత్సరాల స్వల్ప కాలంలో 2400 ప్రజ్ఞా పీఠాలు నిర్మాణం కావడం ఇందుకొక ప్రత్యక్ష ఉదాహరణ. నేను నా ధనంతో పని ప్రారంభించాను. నా వారసత్వపు ఆస్తిని అమ్మడం వల్ల వచ్చిన ధనంతో నేను గాయత్రీ తపోభూమిని నిర్మించాను. నా జన్మస్థలంలో ఒక ఉన్నత పాఠశాలను నిర్మించాను. ఆ తర్వాత అక్కడ ఒక శక్తి పీఠం కూడా నిర్మించబడింది. మథురలోని గాయత్రీ తపోభూమి భవన సముదాయం, హరిద్వార్‌లోని

శాంతికుంజ్, గాయత్రీ తీర్థం, బ్రహ్మవర్చస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఇవన్నీ విత్తనం నాటితే వందరెట్లు పంట వస్తుందనడానికి ఉదాహరణలు. శ్రద్ధ కొరవడినందువల్ల జనం తమ సంపదను దాచుకుంటారు. విరాళాలకోసం చేతులు చాచుతారు. లాటరీలో గెలవాలని దేవుణ్ణి ప్రార్థిస్తారు. పూర్తి శరణాగతితో ప్రారంభం జరిగితే, ఫలితం అద్భుతంగా ఉండి తీరుతుంది. గుజరాత్‌లోని జూనాగఢ్‌లో శక్తి పీఠాన్ని (గాయత్రీ ఆలయాన్ని) నిర్మించిన భక్తుడు తన వంట పాత్రలు అమ్మి ఆ నిర్మాణాన్ని ప్రారంభించారు. ఇంతవరకు నిర్మాణమైన శక్తి పీఠాలలో అది ప్రముఖమైనది.

ఒక మొక్కజొన్న విత్తనం నాటితే వంద మొక్కజొన్న పొత్తుల పంట వస్తుంది. నేను నాకు ఉన్నదంతా సమర్పించినపుడు నిజానికి ఇదే జరిగింది. కుటుంబ సభ్యులు సంపాదనాపరులు కానంతవరకు వారిని పోషించాలి. పని చేయగలిగి, సంపాదిస్తున్న కుటుంబ సభ్యుల కోసం ధర్మాన్ని, శ్రమనూ, మేధాశక్తినీ వినియోగిస్తూ పోవడం, వారికోసం ఆస్తి వదలి చనిపోవడం నీతిబాహ్యమైన పనులు. నేను వాటిని వ్యతిరేకించాను. వారసత్వంగా వచ్చినది అయినా – స్వయంగా సంపాదించని ధనం అక్రమ సంపాదనే. ఈ ఆదర్శంలో పూర్తి



విశ్వాసాన్ని కలిగి ఉన్నందువల్ల – శారీరిక శ్రమ, మానసిక శ్రమ, భావ సంపద, పొదుపు మొత్తాల రూపంలో ఉన్న నా సంపదను అయోగ్యుల చేతుల్లోకి నేను వెళ్లనివ్వలేదు. దైవ ఆరాధనకూ, సమాజంలో ఉదాత్తతనూ, మంచితనాన్నీ పెంచడానికీ దానిని పూర్తిగా వినియోగించాను. ఫలితం స్పష్టంగా కానవస్తోంది. లోభివలె నేను నా వనరులన్నిటినీ నా స్వార్థం కోసం, నిల్వ చేయడంకోసం, నా కుటుంబ సభ్యులను కోటీశ్వరులను చేయడం కోసం వాడి ఉంటే – అదంతా వృథా అయ్యేది.

కొన్ని పుణ్య కార్యముల, సత్కార్యముల ఫలితాలను పొందడానికి తర్వాతి జన్మ వరకు వ్యక్తి వేచి ఉండాలి. అయితే, ప్రజాసేవ ఫలితం మాత్రం తక్షణం అందుతుంది. ఇతరులు కష్టాలలో మునిగి ఉన్నప్పుడు, వారిని ఓదార్చడంలో మన ఆత్మకు తృప్తి కలుగుతుంది. దాత యొక్క సామాను గది ఎప్పుడూ ఖాళీగా ఉండదన్నది ఒక దివ్య సూత్రం. దైవానుగ్రహం ఎప్పుడూ అతనిపై ఆశీస్సులు కురిపిస్తుంది. ఖర్చు పెట్టిన మొత్తం ఎన్నో రెట్లు పెరిగి తిరిగివస్తుంది.



గొఱ్ఱెలు ఉన్ని ఇస్తాయి. అయినా, ప్రతి సంవత్సరం కొత్త ఉన్ని తయారవుతుంది. చెట్లు పండ్లను ఇస్తాయి. అయినా, ప్రతి ఋతువులో చెట్ల కొమ్మలు పండ్లతో నిండుతాయి. మేఘాలు వర్షిస్తాయి. సముద్రం నుండి నీటిని పొందుతాయి. కనుక అవి ఎన్నడూ ఖాళీ కావు. దాత యొక్క ఖజానా ఎన్నడూ ఖాళీ కాదు. ఒక వ్యక్తి తన సమయాన్నీ, శ్రమనూ, వనరులనూ, అయోగ్యులకు దానం చేస్తే, దుష్టప్రవృత్తులను గ్రుడ్డిగా ప్రోత్సహించి, అదే మంచిపని అని భావిస్తే – అది వేరే విషయం. ప్రజాసేవకు తక్షణం ఫలితం లభిస్తుంది. ఈ పనిలో పెట్టుబడి పెట్టిన వ్యక్తికి ఆత్మ సంతృప్తి, ప్రజల మన్నన, దైవానుగ్రహం తప్పక లభిస్తాయి. తమ తెలివికి మురిసిపోయే లోభులు చివరికి దారుణంగా నష్టపోతారు. ప్రతిఫలంగా పేరు ప్రఖ్యాతులను ఆశిస్తే, ప్రజాసేవ అర్థాన్ని కోల్పోతుంది. పత్రికలో వాణిజ్య ప్రకటన ఇచ్చే విధంగా – అది వ్యాపారంగా మారుతుంది. ఒక వ్యక్తికి చేసిన సాయాన్ని అతడికి గుర్తుచేస్తే, ఆ సాయానికి ప్రతిఫలం ఆశిస్తే – అది పుణ్యకార్యం కాకుండా పోతుంది. ఒత్తిడివల్ల ఇచ్చే విరాళాలు దాతృత్వం యొక్క నిజమైన గమ్యాన్ని చేరజాలవు. అలాంటి పని వల్ల దయా దాక్షిణ్యాలూ, ధార్మిక భావనలూ పెరుగుతాయా! అన్నది



దానికి గీటురాయి. ఈ రోజుల్లో ఆడంబరాలూ, ద్వంద్వ ప్రమాణాలూ సర్వత్రా కానవస్తున్నాయి. అమాయక ప్రజలను మోసగించి దోపిడీ చేసే పరాన్నజీవులను పెంచుతుంది ఈ ధోరణి. ధనాన్ని ఖర్చు పెట్టేముందు చివరకు అది ఎలా వినియోగపడుతుందో వ్యక్తి వేయి మారులు ఆలోచించాలి. అలాంటి దూరదృష్టినీ, విజ్ఞతనూ ప్రదర్శించడం ఈనాడు అత్యవసరం. కనుకనే కొన్ని సందర్భాలలో నేను ఆయా ప్రతిపాదనలను తిరస్కరించాను, నాకు దయా దాక్షిణ్యాలు లేవనే మాట పడడానికి సాహసించాను.

ఉపాసన, సాధన, ఆరాధన అనే ఈ త్రివేణి నా జీవన తత్త్వాన్ని ప్రతిబింబిస్తుంది. తమ లక్ష్యాలను సాధించి పేరు ప్రతిష్ఠలు పొందిన మహనీయులందరూ అనుసరించిన మార్గం ఇది. ఈ మార్గానికి అడ్డదారులు లేవు.